ప్రభుత్వం హామీలు నెరవేరుస్తుంది



గ్యాస్ సిలిండర్ మంజూరు పత్రాలను అందించిన కౌన్సిలర్లు

మణికొండ: వట్టినాగులపల్లి గ్రామంలో పేదలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకు గ్యాస్ సిలిండర్ అందించేందుకు బుధవారం లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో 370మందికి మంజూరు అయ్యాయి పత్రాలను మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, కౌన్సిలర్ యాదమ్మలు గ్రామంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమాన్ని చూసేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని, ఇతర ప్రభుత్వాలు ఎప్పుడూ పేదలకు మేలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిశుపాల్‌సింగ్ ధర్మపురి ముదిరాజ్, రాగం సురేష్‌యాదవ్, కుమ్మరి శేఖర్, ప్రదీప్‌కుమార్, అరుణ్‌కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించని హోటల్‌కు రూ.10 వేల జరిమానా



శ్రీ రమణ మహర్షి ఫుడ్ కోర్టుకు రూ. 10 వేల జరిమాని విధిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: హైదర్షాకోట్ శాంతినగర్‌లోని శ్రీ రమణ మహర్షి ఫుడ్ కోర్టును బుధవారం ఉదయం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ యాజమాన్యం ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి రూ.10 వేల జరిమానా విధించారు. ఇష్టానుసారంగా హోటల్‌ను నిర్వహిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రావణ్, శానిటరీ జవాన్లు మల్లేష్, నరేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



నార్సింగిలో శానిటేషన్ పనులను పరిశీలించిన చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డు మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన మాస్ క్లీనింగ్ కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి స్వచ్ఛ నార్సింగిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం

మణికొండ: గండిపేట చెరువులో ఓ మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించటంతో నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత పది నుంచి 15 రోజుల క్రితం మూసీ వాగులో కొట్టుకుని వచ్చి ఉండచ్చని, లేదంటే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చన్నారు. ఆమె వయసు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని, మెడలో నల్లదారానికి తాయత్తు ధరించి ఉందన్నారు. మృత దేహం పూర్తిగా కుళ్లి పోయిందని, కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. ఆమె గురించి తెలిసిన వారు 8712568341, 9490617189కు సంప్రదించాలన్నారు.

గోల్కొండ ఆసుపత్రికి రోగుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. డెంగీ, వైరల్ ఫీవర్, గొంతి నొప్పి, జలుబు తదితర సీజనల్ వ్యాధుల బారిన పడిన వారు గోల్కొండ ఆసుపత్రికి వస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఔట్ పేషంట్స్ సెంటర్ వద్ద రోగులు బారులు తీరుతున్నారు. అంతేకాకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌ల వద్ద సైతం భారీ క్యూలు ఉంటున్నాయి. అయితే ఔట్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విభాగంలో అదనపు సిబ్బందిని నియమించడం జరిగిందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. ఇన్ పేషంట్ విభాగం కూడా ఫుల్ ఆక్యూపెన్సీతో ఉందని ఆయన తెలిపారు.

గురువులు దైవంతో సమానం

గోల్కొండ: గురువులు దైవంలాంటి వారని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికైన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, వీనస్ విద్యా సంస్థల అధినేత మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్, శ్రీ పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమితీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, బి.సాయిబాబాచారి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిజం సమాజానికి అద్దం లాంటిది'

గోల్కొండ: జర్నలిజం సమాజానికి అద్దం లాంటిదని ఆల్ ఇండియా బజ్మ ఏ రహమత్ ఏ ఆలం అధ్యక్షుడు ఎంఏ ముజిబ్ అన్నారు. బుధవారం ఆయన అహ్మద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు రోహిత్ ఉపాధ్యాయకు రహమత్ ఏ ఆలం పీస్ అవార్డు 2024 అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవస్థను తీర్చిదిద్ది ప్రజలకు ప్రాథమిక హకుల పరిరక్షణ, ప్రజలకు భారత రాజ్యాంగం అందించిన హక్కులను తెలియజేసేదని అన్నారు. ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. ఎన్నో దేశాల స్వాతంత్ర పోరాటంలో పాత్రికేయులు నిర్భయంగా తన పాత్రను పోషించి స్వాతంత్ర సమరయోధులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అఫ్జల్ రసూల్ తదితరులున్నారు.

కబ్జా కోరల్లో 'ఫిరంగి' కాలువ

- నిజాం కాలంలో సాగు, తాగునీటి వ్యవస్థ కోసం ఏర్పాటు
- గొలుసుకట్టు చెరువులకు ఆధారంగా కాలువ
- అక్రమార్కుల చర్యలతో ధ్వంసమవుతోన్న ఫిరంగి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మండలంలోని జూకల్‌లో ఫిరంగి కాలువను ధ్వంసం చేసి పొలంలో కలిపేసిన దృశ్యం

శంషాబాద్ రూరల్: నిజాం కాలంలో సాగు, తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన 'ఫిరంగి' కాలువ కనుమరుగవుతోంది. గొలుసుకట్టుగా చెరువులు, కుంటల వరదనీటిని ఈ కాలువ ద్వారా పారేలా రూపొందించగా, నేడు కబ్జా కోరల్లో చిక్కుకుపోయింది. మండలంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటి పరిధిలో విస్తరించి ఉన్న ఫిరంగి రోజు రోజుకు అక్రమార్కుల చర్యలతో ఆనవాలు లేకుండాపోతోంది.

షాబాద్‌లో ప్రారంభమై..

ఫిరంగి కాలువ షాబాద్ మండలం నుంచి ప్రారంభమై శంషాబాద్, రాజేంద్రనగర్, బాలాపూర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల ప్రాంతాల్లో విస్తరించి ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను అనుసంధానం చేస్తూ ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో కలిసేలా అప్పట్లో ఏర్పాట్లు చేశారు. వర్షాకాలంలో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతూ ఈ ఫిరంగి కాలువ ద్వారా నీరు మరో చెరువుకు చేరుకుంటూ వెళ్లేది. అయితే ప్రస్తుతం చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్న రియల్టర్లు ఫిరంగి కాలువ ఆనవాలు లేకుండా చేస్తున్నారు.

అక్రమార్కుల కబ్జా కోరల్లో..

ఫిరంగి కాలువ కబ్జా కోరల్లో చిక్కుకుని కనుమరుగవుతోంది. మండలంలో రామంజాపూర్‌లో మొదలై బోటిగూడ, అచ్చంపేట, పిల్లోనిగూడ, జూకల్, కాచారం, చౌదరిగూడ, నర్కూడ, ఊటీపల్లి, తొండుపల్లి నుంచి శంషాబాద్ పట్టణంలోకి చేరుతుంది. ఇక్కడి నుంచి సాతంరాయి మీదుగా రాజేంద్రనగర్ పరిధిలోకి వెళ్తుంది. అయితే చాలా చోట్ల ఈ కాలువను పూర్తిగా మూసి వేశారు. కాలువకు ఇరువైపుల ఉన్న భూముల్లో కాలువను కలిపేసి చదును చేశారు. కొన్ని చోట్ల కాలువ విస్తీర్ణాన్ని కుదించి పక్కా నిర్మాణాలు చేపట్టారు.

భూముల ధరలకు రెక్కలతో..

ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు, రియల్టర్లు ఫిరంగి కాలువను ధ్వంసం చేసి భూముల్లో కలిపేస్తున్నారు. జూకల్, కాచారం, నర్కూడ, చౌదరిగూడ, అచ్చంపేట, రామంజాపూర్, తదితర ప్రాంతాల్లో కాలువను ఇష్టానుసారంగా కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. ఇందుకు సాగునీటి శాఖ అధికారులు ఎన్‌ఓసీలు జారీ చేయడం గమనార్హం. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమార్కుల చర్యలకు అడ్డులేకుండా పోతోంది. ఇక శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలో ఫిరంగి కాలువపై ఏకంగా నిర్మాణాలు చేపట్టినా అధికారులకు కనిపించడంలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

వరదనీటికి అడ్డంకులు..

వర్షాకాలంలో వరదనీటికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఆయా చెరువులు, కుంటల నుంచి అలుగుపారిన వరదనీరు ఫిరంగి కాలువ గుండా దిగువన ఉన్న చెరువుల్లోకి వెళ్లేది. అయితే కాలువ కనుమరుగుకావడం, కుదించుకుపోవడంతో వరదనీరు పంట పొలాల్లోకి చేరుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



జూకల్ శివారులో ఓ వెంచరు ఆనుకుని ఫిరంగి కాలువపై నిర్మించిన ప్రహరీగోడ

పాఠశాలల్లో 'స్వచ్ఛతా' ప్రతిజ్ఞ



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు



స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

శంషాబాద్: భారత్ స్వచ్ఛతా మిషన్‌లో భాగంగా మున్సిపాలిటీ అధికారులు పట్టణంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల చేత స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వారానికి 2 గంటల పాటు స్వచ్ఛత కోసం కేటాయించాలని కమిషనర్ సుమన్‌రావు సూచించారు.

స్వచ్ఛతహి సేవ...

బండ్లగూడ: సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై అవగాహన కల్పించడంతోపాటు చెత్త పాయింట్స్‌ను, చెరువుల వద్ద క్లీనింగ్ కార్యక్రమాలను చేపట్టారు. ఖాళీ మందిర్ మెయిన్ రోడ్డులో ఉన్న షాపు వారికి ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ శ్రావణ్, శానిటరీ జవాన్లు సురేష్, నరేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగామారిన రహదారి

అత్తాపూర్: శివానగర్ వెళ్లే ప్రధాన రహదారి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే-155,156 పిల్లర్ నుంచి సర్వీస్ రోడ్డు మార్గంలో ప్రయాణికులు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. సర్వీస్ రోడ్డులో ఉన్న దట్టమైన పొదలు-చెత్తా నిండిపోవడంతో మద్యం ప్రియులు ఆ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నారు. ఈ సర్వీస్ రోడ్డు మార్గాన్ని ఆధునికరించాలని శివానగర్ వాసులు రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసులు, అధికారులు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అన్నారు. బుధవారం సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ ఫార్మ్ రైస్ట్ వన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్యాక్స్ శామిర్‌పేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెజిటేబుల్ కలెక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో నష్టాల్లో ఉన్న సహకార అనుబంధ సంఘాలను తిరిగి లాభాల బాటలోకి నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో టెస్కాబ్ భాగస్వామ్యంతో ఫార్మ్ రైస్ వన్ వ్యవసాయ మార్పిడి వేదికను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

సర్వీస్ రోడ్డు మార్గాన్ని ఆధునీకరించాలి



సర్వీర్ రోడ్డు మార్గం

అత్తాపూర్: అత్తాపూర్ పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఎలివేటెడ్‌వే-118 ఎంక్యూబ్ చౌరస్తా నుంచి మూసి నదిని అనుసంధానం చేసుకుంటూ లంగర్‌హౌస్ బాపూఘాట్ బ్రిడ్జీ మార్గం గుండా చేవెళ్ల పరిగి వికారాబాద్ శంకర్‌పల్లి వైపు వెళ్లాల్సిన వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. 118 పిల్లర్ నుంచి మొదలైన ఈ రోడ్డు మార్గం కిలోమీటరు మేరకు సింగిల్ రోడ్డు ఉంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళలో రద్దీగా ఉండడంతో రోడ్డు మార్గం గుండా ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అంబియన్స్ పోర్టు సమీపంలోకి రాగానే ఇరుకైన సింగిల్ రోడ్డు కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మూసీ నదిని ఆధునికరిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఈరోడ్డు మార్గం వైపు దృష్టి ఎందుకు సారించడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూసినది పరివాహక ప్రాంతం నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు మార్గాన్ని ఆధునికరించాలని, నది రోడ్డుకు ఒక వైపు ఉన్న గ్యారేజీలకు అక్రమ నిర్మాణాలను తొలగించి రోడ్డు మార్గాన్ని విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

శాతం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



గోల్కొండ: శాతంచెరువులో వర్షపు నీరు ప్రమాద స్థాయి కంటే ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గోల్కొండ నయాఖిలాలోని శాతం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న తూము పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో భారీ వర్షాల కు శాతం చెరువు బ్యాక్ వాటర్ నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారిని భయాందోళనకు గురి చేస్తుందన్నారు. గత వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు తాను శాతం చెరువును ఎన్నోసార్లు సందర్శించానని, తూము పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రతిసారి అధికారులకు తెలుపుతున్నానన్నారు. అయితే తూము పనులను అధికారులు ప్రణాళికబద్ధంగా చేయకపోవడం వల్లనే చెరువు లోని నీరు త్వరగా బయటకు వెళ్లడం లేదని ఆయన పేర్కొన్నారు. బల్దియా ఇరిగేషన్ అధికారి జ్యోతి, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా చార్మినార్ వద్ద రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల అనంతరం కళాకారులు మంగళవారం రాత్రి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్యారసాని వెంకటేష్, దేవాలయం ట్రస్టీ శశికళ తదితరులున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు



మైలార్‌దేవ్‌పల్లి: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్ సమీపంలోని బెంగుళూర్ జాతీయ రహదారిపై బుధవారం ఆగి ఉన్న లారీని బెలోనో కారు అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న వక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. కారులోని బెలున్ తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమైందని పోలీసులు తెలిపారు. బాధితుడి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో ఐటీఐ ట్రేడ్‌లలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని 'మనూ' ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా అజమ్ బుధవారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ ద్వారా దరఖాస్తులను పొందవచ్చని, లేనట్లయితే విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్‌ను ఈనెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలకు గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు.

హెచ్‌సీయూలో 'స్వచ్ఛతా హీ సేవ' షురూ

అక్టోబర్ 2 వరకు 'క్లీనప్ డ్రైవ్'



రాయదుర్గం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'స్వచ్ఛతా హీ సేవ' పేరిట ప్రత్యేక క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో హెచ్‌సీయూ ఉద్యానవన విభాగం, పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు. క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష గడువు పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతిలో చేరడానికి దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డి విజయభాస్కర్ బుధవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18న నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన ప్రస్తుతం 5వ తరగతి విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఈ గడువు తేదీ పెంపుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రూ. లక్షల్లో పలికిన లడ్డూలు



రూ. లక్షా12వేలకు లడ్డూపు సొంతం చేసుకున్న ముద్దం అశోక్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులు చివరి రోజు జోరుగా గణపతి లడ్డు వేలం పాటలు నిర్వహించారు. గణేష్ నగర్ జైహింద్ యూత్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం పోటీలో మార్కండేయనగర్ ప్రాంతానికి చెందిన గంజి జగదీష్ 1లక్ష 88 వేలకు కైవసం చేసుకున్నారు. ఉడంగడ్డలోని శివాజీ యూత్ క్లబ్ వారు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో 1లక్ష 12వేలకు స్థానికులు ముద్దం అశోక్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. డివిజన్ పరిధిలో గాలా టి.ఎన్.జి.ఓ.ఎస్ కాలనీ గల్లీ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేష్ లడ్డూ వేలంలో ప్రగతి కాలనీలోకి చెందిన రంజిష్‌రెడ్డి, రాజు యాదవ్ రూ.1లక్ష31వేలకు కైవసం చేసుకున్నారు. డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, కాటేదాన్, పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, వినాయక నగర్, ఉడంగడ్డ, బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి.



రూ. 1లక్ష88వేలకు లడ్డూను దక్కించుకున్న గంజి జగదీష్



రూ.1లక్ష31వేలకు లడ్డూను కైవసం చేసుకున్న రంజిష్‌రెడ్డి, రాజుయాదవ్



వివేకానంద కాలనీలో రూ. 3 లక్షలకు లడ్డూను దక్కించుకున్న దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి